క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా స్వర్ణ తులసీదళార్చన



పూజకు సిద్ధం చేసిన స్వర్ణ తులసీ దళాలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేష అభిషకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

నడకతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం

సింహాచలం: నడక ఆరోగ్య ప్రదాయిని అని, నిత్య వ్యాయామంగా నడకను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సీషోర్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పెద సోములు తెలిపారు. సింహగిరిపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నడకతో శారీరక రుగ్మతలు తొలగడంతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 తొలి మాస పత్రిక వాక్‌టాక్ మేగజైన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఎలెక్ట్ ఆర్.ఆర్.ఎస్.మహేష్, కేబినెట్ ఉప కార్యదర్శి కె.మాధవి, కోశాధికారి డి.లక్ష్మణరావు, మేగజైన్ ఎడిటర్ డి.శిరీష, గొడుగు వాకర్స్ అధ్యక్షుడు శివరామకృష్ణ, ఎస్‌వీఎల్ఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గొర్ల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రెజ్యూమె ఆకట్టుకునేలా ఉండాలి



అతిథి సందీప్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలతోపాటు కంపెనీలకు పంపించే వ్యక్తిగత సమాచారంతో కూడిన రెజ్యూమె రూపొందించడం కూడా చాలా కీలకమని ఎంఎస్ఎం యూనిఫ్‌టెక్ దక్షిణ భారత దేశం ఇన్‌చార్జి సందీప్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎంబీఏ విద్యార్థులకు సొంతంగా రెజ్యూమె రూపొందించడంలో మెళకువలు వివరించారు. విద్యార్హతలు, ప్రొఫెషనల్ ప్రొఫైల్ మెరుగు పర్చుకోవడం వంటి సమాచారం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎంబీఏ విభాగాధిపతి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగాల ప్రదర్శన ప్రారంభం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అగనంపూడి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో నాలుగు రోజుల జ్యోతిర్లింగాల ప్రదర్శనను ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న జ్యోతిర్లింగాల నమూనాలను రూపొందించి ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ విశాఖ జిల్లా ఇన్‌చార్జి బీకే వేణి అక్కయ్య మాట్లాడుతూ సోమవారం నుంచి బుధవారం వరకు రోజూ సాయంత్రం ఐదు నుంచి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. శివరాత్రి నాడు రోజంతా జ్యోతిర్లింగాల దర్శనం కల్పిస్తామన్నారు. మానవాళి ప్రశాంత జీవనం గడపడం, విశ్వశాంతి కోసం సంస్థ ఆది నుంచి పనిచేస్తుందని చెప్పారు. మనిషి అనేక రకమైన ఒడుదుడుకులతో ఒత్తిళ్లకు గురవుతున్నారని, అటువంటి వారికి ప్రశాంతత చేకూర్చడమే సంస్థ లక్ష్యమన్నారు.



జెర్రిపోతుపాలెంలో కూటమి నేతలు కూల్చివేతకు ప్రతిపాదించిన అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ భవనం

జెర్రిపోతులపాలెంలో పదేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని గత ప్రభుత్వం మోడల్ అంగన్‌వాడీగా తీర్చిదిద్దింది. పిల్లలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల మరుగుదొడ్డి కూడా మంజూరు చేశారు. ఇక్కడ ఫంక్షన్ హాల్ నిర్మాణం పేరిట ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని కూల్చేసేందుకు కూటమి నాయకుడు సర్పంచ్‌గా ఉన్న పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. దీనికి ఆనుకుని ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనం కూడా కూల్చేసి, ఆ రెండు భవనాల స్థలంలో ఫంక్షన్ హాల్ ప్రతిపాదనలపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేం అభివృద్ధి అంటూ ఆక్షేపిస్తున్నారు.

అంగన్‌వాడీ కూలగొట్టి.. ఫంక్షన్ హాల్ కడతారట!

- జెర్రిపోతులపాలెంలో 'కూటమి' నాయకుల వింత ప్రతిపాదన
- అభివృద్ధి పేరిట అంగన్‌వాడీ భవనం కూల్చివేతకు పంచాయతీ తీర్మానం
- గ్రామంలోని ఎస్సీ సామాజిక భవనం కూడా కూల్చివేసేందుకు నిర్ణయం
- ఇదేక్కడి వినాశాభివృద్ధి అంటూ ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు

పెందుర్తి: ప్రజలకు అవసరమైన, అప్పటివరకు లేని భవనాలు, రోడ్లు, ఇతర సదుపాయాలు సమకూర్చితే దాన్ని అభివృద్ధి అంటారు. కూటమి ప్రభుత్వంలో నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి నిర్వచనమే మార్చేశారు. బాగున్న భవనాలను, రోడ్లను తొలగించి, ఆ ప్రాంతంలో కొత్తగా నిర్మాణాలు చేస్తామంటూ వింత పోకడలు పోతున్నారు. పెందుర్తి పట్టణ ప్రాంతంలో ఓ ప్రజాప్రతినిధి అప్పటికే ఉన్న రోడ్లపై మరోసారి రోడ్లు వేసి దాన్ని అభివృద్ధిగా చూపాడు. ఇప్పుడు మండలంలోని జెర్రిపోతులపాలెంలో కూటమి సానుభూతి సర్పంచ్ అదే బాట పట్టారు. పటిష్టంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, కమ్యూనిటీ భవనాన్ని కూలగొట్టి ఆ స్థలంలో ప్రభుత్వ నిధులతో ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం ప్రతిపాదించారు. ఇందుకు ఏకంగా పంచాయతీ తీర్మానం కూడా ఆమోదింపజేశారు.

ఇరుకు స్థలంలో ఫంక్షన్ హాలా?

జెర్రిపోతులపాలెం గ్రామ నడిబొడ్డున అంగన్‌డీ కేంద్రం ఉంది. దీని పరిధిలో ప్రస్తుతం 7 నెలల నుంచి 3 ఏళ్ల వయసున్న పిల్లలు 28 మంది, గర్భిణీలు 9 మంది, బాలింతలు ముగ్గురు, 3–6 వయసు పిల్లలు 22 మంది, 11 నుంచి 18 ఏళ్ల(కౌమార) బాలికలు 62 మంది ఉన్నారు. ఈ భవనానికి ఎలాంటి మరమ్మతులు అవసరం లేదు. అంతేకాకుండా సిబ్బందికి, పిల్లలకు అవసరాల కోసం ఇటీవల మరుగుదొడ్డి కూడా మంజూరైంది. దానికి ఆనుకునే ఎస్సీ కమ్యూనిటీ భవనం ఉంది. దాన్ని 2020 వరకు పంచాయతీ కార్యాలయంగా వినియోగించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021లో గ్రామానికి ఆనుకుని విశాలంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో గ్రామ సచివాలయాన్ని నిర్మించారు. దీంతో కమ్యూనిటీ భవనాన్ని ఎస్సీ సామాజిక వర్గం వారు తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు ఆయా భవనాలను కూల్చివేసి, పంక్షన్ హాల్ నిర్మాణానికి సన్నాహాలు చేయడమే చర్చనీయాంశమైంది. బాగున్న భవనాలను కూల్చివేసి.. ఇరుకుగా ఉండే ఈ స్థలంలో నూతన భవనం నిర్మాణం కోసం సర్పంచ్ పట్టుబట్టడం గమనార్హం.



జెర్రిపోతులపాలెం గ్రామ సచివాలయం వద్ద విశాలంగా ఉన్న ఖాళీ స్థలం

అదనపు వ్యయం.. అదనపు ఇబ్బంది

వాస్తవానికి గ్రామంలో శుభ కార్యాలు, ఇతర అవసరాలకు ఫంక్షన్ హాల్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే బాగున్న భవనాలను కూల్చివేసి ఇరుకుగా ఉండే ఆ స్థలంలో దాన్ని నిర్మిస్తామనడం విడ్డూరంగా ఉందని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్న భవనాలను కూల్చడానికయ్యే వ్యయంతో బేస్‌మెంట్ పనులు పూర్తి చేయొచ్చని స్థానికులు చెప్తున్నారు. అంగన్‌వాడీ భవనాన్ని కూల్చివేస్తే ప్రత్యామ్నాయం కూడా ఇంత వేగంగా దొరికే పరిస్థితి లేదంటున్నారు. గ్రామ సచివాలయానికి ఆనుకుని ఖాళీగా ఉన్న విశాలమైన స్థలంలో పంక్షన్ హాల్ నిర్మించడానికి వచ్చిన ఇబ్బందులు ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నారు.

ఇదేం అభివృద్ధి..



మా గ్రామంలో శుభకార్యాలకు, ఇతర కార్యక్రమాలకు ఓ భవనం నిర్మిస్తామంటే ఖచ్చితంగా ఆహ్వానిస్తాం. కానీ పటిష్టంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కూల్చివేసి ఈ ఇరుకు ప్రాంతంలో ఫంక్షన్ హాల్ నిర్మించడం ఇదేం అభివృద్ధి. సచివాలయం దగ్గరే విశాలమైన స్థలం ఉంది. ఆ ప్రాంతంలో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదన చేయాలి.

– కోన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, జెర్రిపోతుపాలెం

శిథిలావస్థలో ఉంటేనే కూల్చుతాం



కమ్యూనిటీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేతకు ప్రతిపాదనలు రావడం వాస్తవమే. అయితే వాటి పటిష్టతను అంచనా వేసేందుకు ఇంజనీరింగ్ విభాగానికి లేఖ రాశాం. ఏ భవనం అయినా శిథిలావస్థలో ఉంటేనే వాటిని కూల్చుతాం. నివేదిక వచ్చిన తరువాత నిబంధనలకు లోబడే తదుపరి చర్యలు ఉంటాయి.

– కొల్లి వెంకట్రావు, ఎంపీడీవో, పెందుర్తి

ఉన్నతాధికారులదే తుది నిర్ణయం



అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేతపై ప్రతిపాదనలు మాకూ వచ్చాయి. అయితే కేంద్రం మార్పు, ఇతర అంశాలపై లిఖిత పూర్వక ఆదేశాలు ఇంకా రాలేదు. ప్రస్తుతం ఉన్న కేంద్రానికి మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులొచ్చినా, నిర్మాణ పనులపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఏదేమైనా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే ముందుకు వెళతాం.

– నీలవేణి, సీడీపీవో, పెందుర్తి.

అమర్‌నాథ్‌కు ఆత్మీయ సత్కారం



అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న అదీప్‌రాజ్, దేవిసాంబ, చిన్ని

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, జిల్లా అధికార ప్రతినిధి మనాలత జోబ్‌దాస్(చిన్ని) సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మిందిలోని అమర్‌నాథ్ నివాసంలో నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమర్‌ను ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పలు అంశాలపై చర్చించారు. వారి వెంట పెందుర్తి మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ గొరపల్లి శ్రీను, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, శివ తదితరులు ఉన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: పాఠశాలలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ టి.అసిరితాత సూచించారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలకు, ఆడపిల్లలకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన కలిగించారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఎలాంటి ఇబ్బందులున్నా పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

గాదెకు మద్దతుగా బీజేపీ నేత మాధవ్ ప్రచారం



గాదెకు మద్దతుగా ప్రచారంలో పెందుర్తి హైస్కూల్ ఉపాధ్యాయులతో బీజేపీ నేత మాధవ్

పెందుర్తి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకి మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ పెందుర్తిలో సోమవారం విస్తృతంగా ప్రచారం చేశారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యతా ఓటును గాదె శ్రీనివాసులునాయుడుకు వేసి గెలిపించాలని కోరారు. గతంలో రెండుసార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసి, మరోసారి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆదినారాయణ, పీఆర్‌టీయూ నేత దుర్గారావు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఫిర్యాదు



డిప్యూటీ తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందిస్తున్న గణేష్‌కుమార్

సబ్బవరం: మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధిలో విలువైన ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి, అమ్మకాలు చేస్తున్నారని గ్రామానికి చెందిన అడపా గణేష్‌కుమార్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అసకపల్లి సర్వే నెం.1లో సుమారు 250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇందులోనే గతంలో కొంత మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. మిగిలిన ప్రభుత్వ భూమిని గ్రామ సర్పంచ్, కొందరితో కలిసి ఆక్రమించి, ప్లాట్లు వేసి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక వీఆర్వో కూడా ఇందుకు సహకారం అందిస్తున్నట్లు ఆరోపించారు. అక్రమంగా వేసిన ప్లాట్లకు రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రిపూట పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు చేపట్టి, దోచుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు అసకపల్లి శివారు నక్కవానిపాలెంలో వద్ద సర్వే నెం.87లోని ప్రభుత్వ భూమిలో దర్జాగా బేస్‌మెంట్‌లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వీరిపై చర్యలు తీసుకుని, విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని ఫిర్యాదులో విన్నవించారు.

కాలానుగుణంగా బోధనలో మార్పులు

- డీఎస్ఎన్ఎల్‌యూలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ), ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. దక్షిణ భారతదేశంలోని వివిధ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు పాల్గొని, మాట్లాడారు. ప్రతి రంగంలోనూ అభివృద్ధి చాలా కీలకమని, అధ్యాపకులు కూడా కాలానుగుణంగా వచ్చే మార్పులను తెలుసుకుంటూ బోధన మెరుగుపర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ డాక్టర్ శిల్పామనోజ్ఞ, డాక్టర్ లలిత, డాక్టర్ బాలాజీ, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు నుంచి విచ్చేసిన అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్బవరంలో 94 మంది ఉపాధ్యాయ ఓటర్లు

సబ్బవరం: ఈ నెల 27 జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో 94 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. మొత్తం ఓటర్లలో 50 మంది పురుష ఉపాధ్యాయులు, 44 మంది మహిళా ఉపాధ్యాయులు మండల పరిధిలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం–109 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించామన్నారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

- వాడవాడలా పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలకు ఏర్పాట్లు
- సింహగిరిపై స్వామికి విశేష పూజలు, అభిషేకాలు
- సింహపురికాలనీలో శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవం



సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి



సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి

సింహాచలం: మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై ఉన్న శివాలయాల్లో విశేషంగా పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సింహగిరి క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న త్రిపురాంతకస్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు విశేష అభిషేకాలు, రాత్రి 10.30 నుంచి మహా రుద్రాభిషేకాలు, లింగోద్భవ పూజలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

- సింహపురికాలనీలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం విశేష కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 5 నుంచి ఏకవారాభిషేకాలు, 10.30 నుంచి మహన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకం, రాత్రి 10 నుంచి స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12 నుంచి లింగోద్భవ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరింది.
- పాత అడవివరం, కాపుదిబ్బ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లోను, విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, ప్రియాగార్డెన్స్‌లోని వాయులింగేశ్వరస్వామి ఆలయం, 93వ వార్డు ప్రహ్లదపురంలో ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరుడికి విశేష పూజలు జరిపేందుకు ఆయా ఆలయాల అర్చకులు ఏర్పాట్లు చేశారు.

నిత్యావసర సరకుల వితరణ



అభాగ్యులకు నిత్యావసర సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామం, కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు నిత్యావసర సరకులను సోమవారం పంపిణీ చేశారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 30 మంది పేదలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి, అనంతరం బియ్యం, కిరాణా సరుకులతో పాటు ప్రయాణ ఖర్చులు అందించారు. ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కనకరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిస్టర్ విజయ్ గ్రేస్, బ్రదర్ ఇస్సాక్, మాథ్యూ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు రోడ్డు.. ఆపై భారీ వాహనాలు..



బొంకులదిబ్బ వీధిలో నిత్యం ఇదే పరిస్థితి

పరవాడ: పరవాడ గ్రామం బొంకులదిబ్బ వీధి రోడ్డు ఇరుగ్గా మారడంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వీధిలో రెండు భారీ వాహనాలు ఎదురుపడితే తప్పించుకోవడానికి డ్రైవర్లు పడరాని పాట్లు పడుతున్నారు. సంతబయలు నుంచి బొంకులదిబ్బ వరకు ఇరుకుగా ఉన్న రోడ్డును గతంలో కొంత మేర విస్తరించినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఈ రోడ్డులో నిత్యం జనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. మండల కార్యాలయాలు, వ్యాపార లావాదేవీలు, పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ రహదారినే ఆశ్రయిస్తుంటారు. ప్రతి మంగళవారం జరిగే వారపు సంతకు అనేక గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. వారపు సంత రోజున ఈ రోడ్డు బిజీగా మారుతుంది. విశాఖ, గాజువాక ప్రాంతాల నుంచి తంతడి, వాడచీపురుపల్లి, అచ్యుతాపురం ప్రాంతాలకు నడిచే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు తప్పించుకునేందుకు నానా యాతనలు పడాల్సి వస్తోంది. వెంకటాపురంలో ఓ పరిశ్రమ నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ కంటెయినర్లు కూడా ఈ రహదారి మీదుగానే ప్రయాణించడం వలన మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎదురెదురుగా భారీ కంటైనర్లు వస్తే తప్పించుకోవడానికి అవస్థలు పడాల్సి వస్తోందని వాహనదారులు చెప్తున్నారు. ఇలాంటి సమయంలో వాహన చోదకులు, ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. పరవాడ సంతబయలు నుంచి బొంకులదిబ్బ రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడల్లేని కల్వర్టుతో అవస్థలు



ముత్యాలమ్మపాలెం రక్షణ గోడలు లేని కల్వర్టు

పరవాడ: వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారి, ముత్యమాంబ ఆలయ సమీపంలో రక్షణ గోడలు లేని కల్వర్టుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముత్యమాంబ ఆలయం వద్ద కల్వర్టును నిర్మించి సుమారు 40 ఏళ్లు దాటుతున్నా, కనీసం మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారు. కల్వర్టుపై ఇరు పక్కల నిర్మించిన రక్షణ గోడలు శిథిలమై కూలిపోయినా పట్టించుకునే వారు లేరు. 2018లో రహదారి విస్తరణ సమయంలో శిథిల స్థితిలో ఉన్న కల్వర్టును పట్టించుకోలేదు. ఫలితంగా రహదారిలో రాకపోకలు సాగిస్తున్న మత్స్యకారులతో పాటు ఇతర గ్రామాల ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిలో వీధి దీపాలు కూడా అంతంతమాత్రంగానే ఉండడంతో రాత్రి సమయంలో కల్వర్టు దాటేందుకు నానా అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. శిథిల కల్వర్టును అభివృద్ధి చేసి ప్రమాదాలను నివారించాలని మత్స్యకారులు కోరుతున్నారు.